# 32. వార్నింగ్

"**అమ్మణ్ణో,** పాల్!"

ఆకేక రోజూ నిద్రలేవడానికి కొంచెం ముందుగా వినిపిస్తుంది. ఇవాళ లేటయింది. లేటవడం లోనూ ఓ పావుగంటా అరగంటా కాదు. ఖరాగా గంటంపావు. అమ్మకి తొలివిడత డికాక్షన్‌తో కలుపుకొనే కాఫీ యిష్టం. ఫిల్టర్‌లో దిగుతూ దిగుతూ వుండగా రెండంటే రెండు పెద్ద చెంచాలకి వొంచేసుకుని పక్కనే మరుగుతున్న పాలు గ్లాసుకి నింపేసుకుని రెండు సార్లు గ్లాసులోంచి గ్లాసులోకి కలియబోసుకుని తాగేస్తుంది. "చిన్నీ, లేవ్వే!" అని నా బుజమ్మీద తట్టడం ఆ తరవాతే. నేను కళ్లు తెరిచి చూస్తే యెదురుగుండా గోడకి తగిలించున్న గడియారం రెండు కాళ్లూ నిలువుగా జాపి ఫీటు చేసే సర్కస్ పిల్లలా రెండుముళ్లూ జాపి-

ఇదుగో, యివాళ ఏడూ యిరవై.

అమ్మ ఇవాళ కాఫీ కో నమస్కారం పెట్టేసి స్నానంచేసేసి పూజగదిలో దూరిపోయి నట్టు తెలుస్తోంది. పిల్లాడు పాలు తాగకండానే ట్యూషను కెళ్ళిపోయినట్టు తడుతోంది.

గిన్నెపుచ్చుకుని ముందు వరండాలో కెళ్ళి తలొంచుకుని పాలు పోయించుకున్నాను. పాలవాడు వెళిపోతుంటే గుమ్మం తలుపు గొళ్లెం పెడదామని ముందుకెళ్తే -

అక్కడ నిలబడున్నాడు శివరావు.

చేతిలో సూట్‌కేసు.

"తలుపేసీకు. " అన్నాడు.

శివరావుకి తెలీదు; ఆ తలుపు నే నెప్పుడో వేసీసేనని; మరి తెరిచే ప్రసక్తే లేదని.

"కూచో." అని, అక్కడున్న మడత కుర్చీని కొద్దిగా ముందుకి జరిపేను.

సూట్‌కేసు దింపేడు. అంటే, అతన్ని లోపలికి రానివ్వనని గ్రహించేడన్న మాటే. ఇంట్లో కెళ్లడానికని వెనక్కితిరిగేను.

"నేనొక్కసారి బాత్రూం కెళ్లాలి."

తలొక్కటీ వెనక్కి తిప్పేను. "బాత్రూంలో అమ్మ వుంది. " అన్నాను."పెద్దబాధైతే వీధి చివర కార్పొరేషన్ వాళ్లు కట్టించిన కాంప్లెక్సుంది. చిన్నబాధైతే సైడు కాలవ వుంది."

నేను లోపలి కెళిపోతూ వుండగా"అంతే తప్ప నన్ను లోపలికి రానివ్వవన్నమాట!" అని శివరావన్నమాటలు వినిపించేయి.

పాలగిన్నెని కిచెన్ ప్లాట్‌ఫాం మీద పెట్టి స్టవ్వు వెలిగించేను. గిన్నెని పొయ్యిమీద వుంచి పూజగది వేపొచ్చేను. "అమ్మా; కాఫీ కలుపుకొని తాగు. నాకిప్పుడప్పుడే వొద్దు. నేను వీధివరండాలో కెళ్తున్నాను. నన్నిక్కడికి పిలవొద్దు. నువ్వక్కడికి రావొద్దు. పది నిమిషా- లంతే.

పడక గదిలో కెళ్ళి బొట్టూ కట్టూ సరిచూసుకున్నాను. ఫేనూ, లైటూ తీసేశాను.

అక్కపోయింది. తమ్ముడు నోటితో అనకపోయినా పొమ్మన్నాడు. కనకనే, నేనెంచుకున్న బతుకు పద్ధతి నచ్చకపోయినా అమ్మ నాయింటికి చేరింది. అంచేత; శివరావుతో నేననవలిసిన మాటలు వినడానికి రాదు.

వీధి వరండాకీ ముందు గదికీ మధ్య వున్న తలుపు బిగించి గడియ పెట్టిన చప్పుడికి అంతసేపటి దాకా మడతకుర్చీలో కళ్లుమూసుకుని చేరబడి వున్న శివరావు కళ్లు తెరిచి ముందుకి వంగేడు. నేను, ఇటువేపున్న సోఫాలో; నా విసుగూ చిరాకూ అసహ్యం తెలిసేటట్టుగా ధడాల్న కూర్చున్నాను. నా స్థానబలం, అధికారం తెలిసేటట్టుగా కాలిమీద కాలేసుకున్నాను. నా పెత్తనం, దర్జా తెలిసేటట్టుగా చేతులు రెండూ బారజాపి సోఫా పై అంచుమీద పరిచేను. “ఏమిటి, సంగతి?” అన్నాను.

“పిల్లాడేంచేస్తున్నాడు; ఇంకా లేవలేదా?”

“మరే... ...టైము ఏడున్నర కావొస్తోంది. నీ మొహం కనబడ్డ చిరాకులో లేటుగా వొచ్చినందుకు పాలవాణ్ణి చీవాట్లు పెట్టడమే మర్చిపోయేను!... ...”

నవ్వేడు. “వరసంతా కొత్తగా వుందే!”

“కామెంట్లొద్దు. నాయింటికి రానక్కర్లేదని, రావొద్దని - నీ కిదివరకే స్పష్టంగా చెప్పేను. ఇక్కడికి రాడానికి నీకే అవసరమూ లేదని నీకూ తెలుసు. ఐనా, వొచ్చేవు! ఉదయం పూట నాకు బోలెడు పన్లుంటాయి. నా సమయం వృథా చేసి నా మూడ్ చెడగొట్టక, సంగతేమిటో రెండు ముక్కల్లో చెప్పేసి ఒచ్చిన దారంటే వెళిపో. మరోసారి చెప్తున్నాను; నువ్వు కె. వెంకట్రామయ్య అనే పేరుతో నా కొడుక్కి తండ్రివైతే అవును; కాని, నువ్వు; అంటే పి. సుందర శివరావు - నా మొగుడివి కాదు; నా బోయ్‌ఫ్రెండువి కూడా కాదు!’

“కామేశ్వరి పోయింది-”

“ఉత్తరం రాసేవుగా.”

“ఉత్తరంలో చాలా రాసేను. నా పెద్దకొడుకు ఉద్యోగానికి పోయేడు. నా కూతురికి పెళ్లిచేసి పంపించేసేను. మా నారాయణమూర్తి నీ కొడుక్కన్నా చిన్నవాడు. సారీ... మన కొడుకు... వెంకటరమణకి ఆ పేరైనా ఉంచేవో లేక మార్చేసేవో నాకు తెలియదు. అయినా సరే; వాడూ, నువ్వూ, మీ అమ్మా నా దగ్గిరికొచ్చేస్తే-మీ అమ్మని మా అమ్మలాగ; వెంకట్రవణని మన ఇప్పటి పెద్ద కొడుకులాగ; మరి నిన్ను - చిన్న భార్యంత గారాబంగానూ పెద్ద భార్యంత గౌరవంగానూ చూసుకుంటాను. నిజానికి కామేశ్వరి కంటె ఓ యాడాది పెద్దదానివే కద, నువ్వు!?”

నా కొక్కసారిగా చిరాకు తారాస్థాయికి పెరిగింది. రెండు చేతులూ సోఫా మీంచి తీసేసి గాలిలో ఇష్టానుసారంగా - కాదు- అదుపు లేకండా ఆడిస్తూ మాట్లాడేను; “ఓ, స్టాప్‌దట్ నాన్‌సెన్స్! నువ్వు ఎవర్ని యెవర్లాగ చూసుకుంటావో, నీ కెవరిమీద ఎప్పుడు ఎంత శ్రద్ధ, ఆసక్తి పుడతాయో నాకు క్షుణ్ణంగా తెలుసును. నీకున్న స్త్రీ వ్యామోహం, పరధనాపేక్ష నాకు తెలియవనా, నీ ఉద్దేశం? పదిమందికి పాఠాలు చెప్పి బతుకులు దిద్దవలిసిన వృత్తిలో ఉండీ కూడా నువ్వు శిష్యురాళ్లతో, పనిమనుషులతో, ఇంకా అడ్డమైన రకాల్తో నడిపించిన వొందల కొద్దీ చిల్లర మల్లర వ్యవహారాలు నాకు తెలియవనే నువ్వను కుంటున్నావా? అన్నీ తెలిసి, నోరుమూసుకు ఊరుకుని నా డబ్బునీ, ముత్యాలదండలాంటి నాకొడుకునీ యోగ సంపన్నమైన నా శరీరాన్నీ నీ పరంచేసి లేనిపోని చీదర్లు నెత్తిమీద వేసుకునేటంత మూర్ఖురాల్ని కాను!”

లేచాను.

"కనక; ఓయి, శివరావూ! ఇక్కడ నీకేం పన్లేదు; నీదంటూ యేమీ లేదు." గుమ్మం దగ్గిర కెళ్ళి తలుపు గొళ్ళెం తీసేను. "పో, వెళిపో!" అని అరిచి; తలుపులు బారుగా తెరిచేను.

"అదికాదు ప్రసన్నా-" శివరావు లేచేడు.

"నోరు మూసుకుని అవతలికెళ్ళు! ఇంక నా జోలికి రాకు. వొచ్చావో; నువ్వొక ఇంపోస్టరు వనీ, చీట్ వనీ పోలీస్ రిపోర్టిచ్చి కేసుపెట్టి నిన్ను జైలుకి పంపించగల్ను. ఏ పాపం యెరక్క; "పితృదేవోభవ" అనుకుంటున్న నీ పిల్లల మనస్సులు విరిచేసుకోకు. పో... అవుట్!" తెరిచిన ద్వారంలోకి ఎడంచేతి వేలు చూపించేను.

ఎదుటింటి వాకిట్లో నరసయ్యగారు, రుక్మిణమ్మ, అమల -, మేడమీది పిట్టగోడ దగ్గిర వేణు, విమల, బుజ్జిగాడు -అందరూ యిటే చూస్తున్నారు.

శివరావు సూట్‌కేసు అందుకున్నాడు.

ఇంతటితో అతగాడు (నా జీవితంలోంచి) నిష్క్రమించినట్టే.. ... ...

## 2

"ష్షు!"

అది విసుగు కావచ్చు. "సైలెన్స్!" అన్నప్పటి టీచర్ గదమాయింపు లాంటిది కావచ్చు. కాని, కళ్ళు తెరవకుండా అటు తిరిగి పడుకుంది కాబట్టి అక్కడికి ఆ వ్యవహారం సరి-అనుకుంటూ శివరావు తన బెర్తుమీద వెల్లకిలా పడుకున్నాడు.

బెజవాడలో రైలెక్కి తన బెర్తు ఇదీ అని నిర్ధారణ చేసుకుని టిక్కెట్ చెకింగ్ చేయించుకున్నపుడు కారిడార్ వేపుగా ఉన్న లైటుంది. ఆ వెలుతురులో, ఎదురుగా ఉన్న వరసలో మధ్య బెర్తు మీద పడుకున్నది ఒక నడివయస్సు ఆడదనీ, ఆవిడ వొళ్ళు మాంఛి పుష్టిగా రంగు తేలి వుందనీ చూసేడు, శివరావు . ఆ శరీరం మీద తక్షణ ఆకర్షణ లాంటి దేదో కలిగింది, అతనికి. బెర్తులో సెటిలయ్యాక తలెత్తి చూసేడు; శివరావు. ఎడం చెయ్యి తలకింద పెట్టుకుని పడుకుంది. ఆ చేతికి నాలుగు బంగారు గాజులున్నాయి. ఒక వేలికి దిట్టమైన ఉంగరం వుంది. ఒక్కతే ప్రయాణం చేస్తోందో, కూడా ఎవరయినా వున్నారో అతని వూహకి అందలేదు. కింద బెర్తులో పడుకునున్న వాడు ఈ విడ తమ్ముడైతే "అక్కా, నువ్వు లోవర్ బెర్తులో పడుకో" అని తను మధ్యబెర్త్ మీదికి వెళిపోయిండేవాడు. "బహుశా వొక్కతే ప్రయాణం చేస్తోంది."

టాయిలెట్‌కి వెడుతూ మొదటిసారి (పాదం మీద, చేత్తో ) స్పృశించినప్పుడు ఆవిడ ఈ మాత్రం శబ్దం కూడా చెయ్యలేదు. అంచేతనే, శివరావుకి, టాయిలెట్‌నుంచి వస్తున్నప్పుడు రెండోసారి ఆవిడని ముట్టుకుందికి చొరవా తెగింపూ కలిగేయి. ఫాన్ గాలికి బెర్త్ అంచు దాటి యివతల రెపరెపలాడుతున్న ఆవిడ చీరచెంగుని తన ఎడం చేతి వేళ్లతో లేపి; బెర్త్‌మీద ఆవేళ్లు మోపి; అక్కడ వూత పట్టుకుంటే గాని తను కిందికి వొంగడం సాధ్యం కానట్టు చరించాడు, శివరావు.

అప్పుడు- ఆవిడ "ష్షు!" అన్నది.

శివరావు కళ్లు మూసుకున్నాడు. మద్రాసులో తను సాధించవలసిన పని; ఆ పనికి సాయపడే ఉద్దేశం వెలిబుచ్చిన రమణయ్య ఇల్లు ఎలా కనుక్కోవాలో తనకి తెలియక పోడం - అలా అలా

మెదడుని ఓసారి క్రాస్‌చేసి వెళ్లాయి. ఇలాంటి ప్రయాణాల్లో కొన్ని తమాషా పరిచయాలు ఏర్పడడం, సరైన పద్ధతిలో వెళ్లిన వాళ్లకి సుఖమో లాభమో చేకూరడం అతనికి స్ఫురించాయి. దాంతో, అతను ఊహాలోకం లోకి వెళిపోడానికి దారి, మెట్లు ఏర్పడ్డాయి.

హటాత్తుగా లైటు వెలిగింది.

లైటేసిన వారు ఎవరై వుంటారో చూదామని శివరావు కళ్లు తెరిచాడు.

లైటారిపోయింది. కాని స్విచ్చిమీద కదిలిన చేతిని బట్టి లైటేసింది ఆవిడేనని శివరావుకి తెలిసింది.

✣ ✣ ✣

పులికాట్ వంతెన మీద రైలు నడుస్తూ వుండగా శివరావుకి మెలకువ వచ్చింది. రాత్రి తను కళ్లారా పూర్తిగా చూడలేకపోయినా రెండుసార్లు తను చెయ్యి తగిలించిన ఆడమనిషి గుర్తుకొచ్చి అటువేపు చూసేడు. ఎదుటి వరసలో మధ్యబెర్తు వ్యక్తి శివరావుని కాలిమీద తట్టి "లేస్తారా? మద్రాసు వచ్చేస్తున్నాం!!" అన్నాడు.

"ఓ!" అని శివరావు చటుకుని లేచాడు. బెర్త్ దిగి నుంచుని, మధ్య బెర్తు కిందికి వాల్చడానికి అవసరమైన పన్లు చేసేడు. ఆ పనంతా అయ్యేక తన దిండుని కిటికీ పక్కగా చేరబెట్టి దాన్ని ఆనుకుని కూర్చున్నాడు. ఎదుటి సీట్లో వున్న "ఆవిడ"వేపు శ్రద్ధ లేనట్టుగా చూసేడు. ఆవిడ యింతసేపూ తనని పరీక్షగా చూస్తోందని తెలిసిపోయింది. ఈ మొహం యెక్కడ చూసేనా అని ఆలోచిస్తూ వుండగానే "శివా!?" అంది, ఆవిడ.

శివరావు గాభరా పడిపోయేడు.

"నేనూ, ప్రసన్న-ని !"

"మైగుడ్‌నెస్! అయామ్ సారీ!"

"దేనికి?"

"నిన్ను గుర్తు పట్టలేకపోయినందుకు!"

"రాత్రే గుర్తు పట్టేవనుకున్నానే -?"

✣ ✣ ✣

నవ్వకుండా, ఆత్మీయత చూపించకుండా మాట్లాడ్డం, అందులో కూడానూ ఎదటి వాళ్లచేతనే ఎక్కువ మాట్లాడించడం; ప్రసన్నకి చిన్ననాటినుంచీ అలవాటే.

ప్రసన్న అంతనిర్లిప్తంగా ప్రశ్నలు మాత్రం వేస్తూ, తన సంగతి యేమీ చెప్పకుండా దాటవేస్తున్నా; శివరావు ఏదో ముద్దాయితనం ఏర్పడినవాడిలాగా నిస్సహాయంగా సమాధానాలు చెప్పేడు.

ఎం.కామ్. అయ్యేక మేనమామ కూతురు కామేశ్వరిని పెళ్లి చేసుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ సర్వీస్‌లో ఉద్యోగం వచ్చింది. కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేసేడు. లెక్చరరుగా కన్‌వర్షన్ ఒచ్చి ఎనిమిదేళ్ల యింది. పన్నెండేళ్ల కిందట అబ్బాయి; పదేళ్లకిందట అమ్మాయి - పుట్టేరు. కుటుంబం రాజమండ్రిలో వున్నారు. మిగతా వూళ్లల్లో పనిచేసేటప్పుడు ప్రయివేట్లు చెబుతూ; హోటళ్లలో తింటూ, ఉద్యోగం కూడా శ్రద్ధగా చేసుకుంటూ, సంపాదన పెంచుకుంటూ కాలక్షేపం చేసుకొస్తున్నాడు... మేనమామా, అత్తగారూ తనకుటుంబంతో బాటే రాజమండ్రిలోనే

ఉన్నారు. "వాళ్లో" మిగతా పిల్లలంతా "సెటిలైపోయి" తలో వూరూ వెళిపోయేరు... రాజమండ్రిలో తను అద్దెకుంటున్న యిల్లు అమ్మకాని కొచ్చింది. ఇరవై వేల రూపాయలు తక్కువ పడ్డాయి. తనతో బాటుగా కొన్నాళ్లు పనిచేసిన రమణయ్య అనే ఫ్రెండు మెడ్రాస్‌లో సినిమా రంగంలో డైరక్టోరియల్ లైన్‌లో వున్నాడు. వారం నాడు ఫోన్ చేస్తేను; "ఓసారి మద్రాసు రాకూడదూ; అన్నీ మాట్లాడుకోవచ్చూ?" అన్నాడు. అందుకు; ఈ ప్రయాణం.

"ఎక్కడ, అతనుండేది?"

"రాజారాం కోలనీ యట. పెరియార్ బ్రిడ్జ్ అని ఒకటొస్తుందిట; అది దాటేక యెడం వేపుని ఓ పెద్ద స్టీల్ సామాన్ల షాపు; ఆ పక్క సందులో కెళ్లి-"

"తెలుసులే... యెన్నాళ్లుంటావు?"

"ఇవాళ చేరుతున్నాను కదా! నా దురదృష్టం కొద్దీ అతను ఏ ఔట్ డోరు షూటింగుకో వెళిపోతే - అదెక్కడో కనుక్కుని అక్కడికి వెళ్లనయినా వెళ్లాలి; లేకపోతే అతనొచ్చే వరకూ వాళ్లింట్లో వుండనైనా వుండాలి......."

"సెలవు పెట్టేవా?"

"ఈ రోజూ రేపూ సెలవు పెట్టేను. ఎల్లుండి ఆదివారం కదా. మొత్తం మూడు రోజులైంది. సరిపోతుందనుకుంటాను."

రైలు ఆగింది. మద్రాసు సెంట్రల్ - లో

✤ ✤ ✤

టిక్కెట్టు గేట్లో ఇచ్చేసి బైటపడేసరికి ప్రసన్న "ఆటో-క్యూ"లో తనకన్నా ఆరు ప్లేసులు ముందుంది. తనగురించి ఏమీ చెప్పిందికాదే అని విచారిస్తూనే నేనేం పట్టించుకోడంలేదులే అన్న పద్ధతిలో నుంచున్నాడు శివరావు. యూనివర్సిటీలో చదివిన రెండేళ్లలో; కాంటీన్‌లో - ప్లేగ్రౌండ్‌లో - ఓపెనెయిర్ థియేటర్‌లో - లైబ్రరీలో - ఈశ్వరమ్మ (కెమిస్ట్రీ రీడర్) గారింట్లో - కొన్ని డజన్ల సార్లు కలుసుకోడం శివరావుకి గుర్తుకొచ్చి; "నువ్విప్పుడెలావున్నా"వని అడగనందుకు తనమీద తనకి చిరాకేసింది.

ప్రసన్న ఎమ్మెస్సీలో చేరిన ఆరునెలలకి వాళ్లనాన్నగారి భూములన్నీ పోతే కూడా ఆమె నిరుత్సాహపడకుండా చదువుకొనసాగించడం; డిగ్రీ లెవెల్లో ఆమె స్టూడెంట్ లీడర్‌గా సాహసిగా అందరి దృష్టినీ ఆకర్షించి మెప్పు పొందడం ఈ అరగంట సేపటినుంచీ శివరావుకి గుర్తుకొస్తూనే ఉన్నాయి. ఈశ్వరమ్మగారు ఓసారి ఇద్దర్నీ కూర్చోబెట్టి హితవుచెప్పింది. "ఇద్దరూ ఒక్కసారే పోస్టుగ్రాడ్యుయేట్లవుతున్నారు. ఒకవూరివాళ్లూ, ఒక కులంవాళ్లూనూ! ఇద్దరూ ఒకే కాలేజిలోగాని, కనీసం ఒకే వూళ్లోగాని లెక్చరర్లుగా వుద్యోగాలు సంపాదించుకుని పెళ్లి చేసుకుంటే బాగుంటుంది; ఆలోచించుకోండి!" అని.

"శివా, ఇలా రా!" అనికేకెపెట్టి ప్రసన్న ఆటోలో దూరుతూవుండగా ఆలోచనల్లోంచీ క్యూలోంచీ బైట పడ్డాడు శివరావు.

✤ ✤ ✤

"కొంత దూరం దీంట్లో వెళదాం. ఆటోలు ఇంకొంచెం వెసులుబాటుగా దొరికేచోట నిన్ను వేరే ఆటో ఎక్కిస్తాను. నువ్వు మద్రాసు రావడం యిదే మొదటిసారా?"

"ఓసారి ఇది వరకు వచ్చేను గానీ-"

"సరేలే... సమంగా కూర్చో. ఆ పెట్టె సీటు మీద మనిద్దరి మధ్యాపెట్టి నీ కాళ్లు పూర్తిగా ఆటోలో పెట్టుకో. అలా బైట వేళ్లాడెయ్యడం మంచిదికాదు."

"సరే, సరే! థాంక్యూ, అదికాదూ; నన్ను ఇదే ఆటోలో రాజారాం కోలనీలో దించేసి నువ్వు మీ యింటికి వెళిపోవచ్చు కదా?"

"అలా కుదర్దు. ఇప్పటికే కొద్దిగా లేటయ్యాను. ఏడున్నర కల్లా నేను మా ఆఫీసులో వుండాలి. ఇవాళొక ఇంటర్వ్యూ వుంది. నలభై రోజుల్నించి ఇంట్లో లేను."

"నలభై రోజులే? ఎక్కడున్నావు?"

"విశాఖపట్నంలోనూ అగ్రహారంలోనూ వున్నాను. మా నాన్నకి జబ్బు చేసిందని కబురొస్తే వెళ్లేను."

"అలాగా? ఆయన కిప్పుడెలావుంది?"

"పోయి ఇవాళకి నెల."

"అయ్యో, సారీ!"

ప్రసన్న అతని వేపు చూడలేదు. అలా అని పైటచెంగుతో కళ్లొత్తుకోనూ లేదు. అక్కడ నిస్సహాయతేమీ లేకపోడాన్నించి శివరావే మరోసారి నిస్సహాయుడయ్యాడు.

✤ ✤ ✤

"ఎక్కడుంటున్నావో, యెలా వుంటున్నావో ఏమీ చెప్పేవు కావు. నేనిక్కడికి పనిమీదనే వొచ్చాననుకో; ఐనా మూడు రోజులుంటాను కదా. ఇలా రైల్లోనో ఆటోలోనో కాకుండా మరింత తీరిగ్గా కలుసుకొని కబుర్లు చెప్పుకోకూడదా?"

"అదే, ఆలోచిస్తున్నా నింతసేపూనూ.. సరే; జాగర్తగా విను... మౌబ్రేసు రోడ్డు అనేవారు, ఇప్పుడు టి.టి.కె రోడ్డు అంటున్నారు. మొదటి క్రాస్‌రోడ్డు; నాలుగో నెంబరు ఇల్లు. మేడమీద... గుర్తుంటుందా?

"టి.టి.కె. రోడ్డు; మొదటి క్రాస్ రోడ్డు; నెంబరు ఫోరు; అప్‌స్టేర్సు; అంతేగా!"

"ఆఁ, అదీ, నా ఎడ్రసు. కింద; రోడ్డుని ఆనుకునే వుంటాయి మేడమెట్లు. అక్కడ నాపేరుతో బోర్డుంటుంది. రేపు-" అంటూనే అక్కడ ఆటోఆపించింది ప్రసన్న. 'దిగు'అంది శివరావుతో.

శివరావు దిగి, తనపెట్టెని దింపుకుంటూ వుండగా ప్రసన్న తన ఆటో డ్రయివర్‌తో తమిళంలో ఏదో చెప్పింది. అతను ఆ పక్కన నిలబెట్టి వున్న ఆటో అబ్బాయితో మాట్లాడేడు. "రాజారాం కోలనీ, కోడంబాక్కం" అనే మాటలు శివరావుకి అర్థమయ్యాయి.

"ఆ ఆటో యెక్కు. రేపు ఉదయం ఎనిమిదింటికి రా... నీ దగ్గిర నీ పాస్‌పోర్టు సైజు ఫోటో వుందా?"

"లేదే; ఎందుకూ?"

"లేకపోతే ఈపూటే ఒకటి తీయించుకో. సాయంకాలానికి ఇచ్చేసే స్టూడియోలు కోడంబాక్కం లో ఉంటాయి. రెండు కాపీలు పట్రా; రేపు వచ్చేటప్పుడు ... బస్సులకోసం చూడకు. ఆటో చేయించుకొచ్చీ!... ఎడ్రస్ మరోసారి గుర్తుచేసుకో..."

✤ ✤ ✤

రాజారాం కాలనీలో ఆటో దిగేవరకు ప్రసన్న శివరావు మనసులోంచి దిగలేదు. యు.పి.ఎస్.సి. పరీక్ష రాసిందని ఆరోజుల్లో ఎవరో చెప్పేరు. కాని, ఇంటిపరిస్థితులూ, ఉద్యోగపు వేట, వీటి ఒత్తిడిలో ప్రసన్న ఏమైంది. ఎక్కడ స్థిరపడింది. అనే ప్రశ్నలు ముఖ్యం అవలేదు. ఈశ్వరమ్మ గారు చెప్పినట్టు ప్రసన్నా తనూ పెళ్లిచేసుకొనుంటే యిద్దరూ ఒకే వూళ్లో ఉద్యోగాలు సంపాదించుకొనుండే వాళ్లు. హాయిగా రెండుచేతులా సంపాదించుకుంటూ యింతకంటే గొప్పగానే బతుకుతూ వుండేవాళ్లు.

ఐతే, ప్రసన్న స్వతంత్ర భావాలు గల మనిషి. సుఖాలొస్తే పొంగిపోడం. కష్టాలొస్తే కుంగిపోడం ఎరగదు. తనతో ఎవరుంటే వాళ్లని దిద్దడమే తప్పా తను ఒకరు చెప్పినట్టు వినడం నడుచుకోడం ప్రసన్నకి సరిపడని సంగతులు. కామేశ్వరికి తలకాయసున్నా అయినా మంచి ఇల్లాలు. నాకు పూర్తి స్వేచ్ఛ, అధికారం ఇచ్చినట్టే ఇచ్చేసి తను ఏ బాధ్యతల జోలికి రాకపోడం అదీ ఓ రకం ప్రేమే. నేను ఎంత చెడ్డా దాని మేనత్తకొడుకునే కదా.

ఏమైనా సరే, రేపు ఆ "టి.టి.కె. రోడ్డు, ఫస్టుక్రాసు; నాలుగో ఇల్లు, మేడమీద-" వ్యవహారం ఏమిటో చూడవలిసిందే. ప్రసన్నకి పెళ్లీ పెడాకులూ లేనట్టేవుంది. చేతులకి బంగారు గాజులూ వాచీ ఉంగరాలూ వున్నాయితప్ప, మెళ్లోమంగళ సూత్రాలు గానీ కాలివేళ్లకి మట్టెలు గానీ కనబళ్లేదు. నేను పెళ్లిచేసుకుని అక్కడా అక్కడా అవకాశాలొచ్చి నప్పుడల్లా ఎఫయిర్స్ పెట్టుకుంటున్నట్టు తను పెళ్లిచేసుకోకుండా ఎఫయిర్స్‌తో గడుపుకొస్తోందేమో? ఏనాటి ప్రసన్న! తన కంటే మూడేళ్లే చిన్నది. అన్ని క్లాసులూ ఫస్ట్ ఛాన్స్‌ల్లోనే పాసయి ఇరవై ఏళ్లకే పోస్టుగ్రాడ్యుఏటయింది. ఇప్పుడు ముప్పయి నాలుగేళ్లు అయ్యుండాలి వయసు. ఎవర్నయినా పెళ్లిచేసుకోవాలనుకున్నా అంత అర్హత గల మగాడు దొరకొద్దూ?

"ఏంటి, ఇంతాలస్యమైంది? నేను సెంట్రల్‌కి ఫోన్ చేస్తే మెయిల్ అరగంట లేటన్నారు. మళ్లీ చేస్తే చేరిపోయిందన్నారు. ఇదుగో వస్తావూ అదుగో వొచ్చేసుంటావు అని చూస్తున్నాను. సెంట్రల్ నుంచి ఇక్కడికి ఆటోలో రావడానికి గంటా పదినిమిషాలా?" అంటూ లోపలికి తీసుకెళ్లాడు; రమణయ్య.

"ఏదో చుట్టుదారంట వొచ్చినట్టున్నాను.- " అన్నాడు శివరావు.

"మొత్తానికి నీ డొంకతిరుగుడు ప్రయాణాల్లో కూడా వొదిలేవు కాదు." అని నవ్వేడు రమణయ్య. "సర్లే. నే నర్జంటుగా వెళ్లాలి. రేపురాత్రి కంతా వచ్చేస్తాను. నువ్విక్కడే వుండు. మా ఆవిడ గుంటూరెళ్లింది. .. స్నానంచేసి. ఈ రోడ్ చివర హోటల్లో కాఫీ టిఫినూ కానిచ్చి, పదకొండున్నరకి ఆర్ముగం అని ఒక బోయ్ వస్తాడు. వంట చేస్తాడు. భోంచేసి రెష్టు తీసుకో."

మరో రెండు నిమిషాలు అప్పగింతల కబుర్లు చెప్పి; "ఫోన్‌లో ఎవరైనా పిలిస్తే వాళ్ల పేర్లూ నెంబర్లూ కాక వాళ్లేమైనా చెప్తే అదీనీ రాసుకో. నేను రేపు రాత్రి నుంచి దొరుకుతానని చెప్పు." అన్నాడు రమణయ్య కారు దగ్గిరికి నడుస్తూ.

"మరి, నా పని?"

"నీ పని - చూద్దాంలే. అవసరమైతే రెండు రోజులు సెలవు పొడిగించి ఉండి పోదువు గాని. ట్వంటీ తౌజండ్ అంటే అంత ఈజీ కాదు."

కారు బయల్దేరి వెళ్లిపోయింది.

శివరావు; టెలిఫోన్ దగ్గిరున్న పుస్తకంలాంటి కాగితాల బొత్తి అందుకుని, "వి. ప్రసన్న లక్ష్మి - టి.టి.కె. రోడ్డు - ఫస్టు క్రాసు - నెంబరు నాలుగు - మేడమీద" అని రాసుకుని, ఆ అక్షరాల్లోంచి

కనబడుతున్న "ప్రసన్న" - "లక్ష్మి" - ని చూస్తూ ఒక నిమిషం కూర్చున్నాడు. ఫోన్ మోగింది.

"హలో!" అన్నాడు శివరావు.

"ఎన్నసార్, ఇన్నుం వీట్లియే ఇరిక్కీంగళా? (ఏమిటిసార్; ఇంకా ఇంట్లోనే వున్నారా?) ఏడర మణియాచ్చి (టైం ఏడున్నరైపోయింది!)" అంది అవతలి గొంతు.

"నో నో; నేను రమణయ్య ఫ్రెండు శివరావుని. రమణయ్య బయల్దేరి వెళిపోయి ఐదు నిమిషాలైంది." అని ఇంగ్లీషులో చెప్పేడు శివరావు.

✣ ✣ ✣

"ఒచ్చేవా? గుడ్. ఇల్లు తేలిగ్గా కనుక్కో గలిగేవా? కూర్చో!" అని శివరావుని పలకరించింది ప్రసన్న. లోపలివేపుకి తిరిగి; "సెల్వీ!" అని కేకేసింది. రేడియో ఆఫ్ చేసింది.

"సెల్వి " అనబడే ఇరవై ఏళ్ల పనిపిల్ల వొచ్చింది. ఈలోగా ప్రసన్న, శివరావు కూర్చున్న కుర్చీ పక్కకి ఇంకో కుర్చీలాక్కుని అందులో కూర్చుంది." సార్ కి నమస్తే చెప్పు. ఎవరో తెల్సా? నా బోయ్‌ఫ్రెండు! వారుండేదీ విజయవాడలోనే. నువ్వు పెళ్ళిచేసుకుని విజయవాడ వెళ్తావుకదా; అప్పుడు నీ వీట్టికారర్‌కి పరిచయం చెయ్యి. సార్ మీకు చాలా హెల్ప్ చేస్తారు. "

సెల్వి దండంపెట్టి, సిగ్గు పడుతూ నుంచుంది.

"ఆ టీపాయి ఇక్కడ వెయ్యి. సార్ కీ నాకూ టిఫిన్ పెట్టు. కాఫీ ఇప్పుడే కాదు... ముందు మంచి నీళ్లు పెట్టు."

సెల్వి తల వూపుకుంటూ వెళ్లింది.

"ఇప్పుడెందుకు ప్రసన్నా - "

"నువ్వొచ్చేముందు టిఫిన్ తిన్నావా?"

"లే దనుకో-"

"మరింకేమి, తినకా? అద్సరే; నీ ఫ్రెండెవరో - ఆ సినిమా వాడు -ఉన్నాడా?"

"నిన్న నేనొచ్చే సరికి వున్నాడు. కానీ, వెంటనే ఏదో ఔట్‌డోరు షూటింగుందని వెళ్లిపోయాడు. ఇవాళ రాత్రికి తిరిగొస్తాట్ట."

"నిన్ననంతా ఏమిటి చేసేవు?"

"అంటేను - రమణయ్య ఇంట్లో ఒక వంటబ్బాయున్నాడు. భోజనానికి ఇబ్బంది పళ్లేదు. పుస్తకాలూ సినిమా మేగజిన్లూ- బైటికి వెళ్లే అవుసరం రాలేదు."

"ఫొటో తీయించుకోమన్నాను కదా?"

జేబులో చెయ్యిపెట్టి ఓ కవరు తీశాడు. కవరు తెరిచి ఒక నెగటివు, మూడు ప్రింట్లు యివతలికి లాగాడు. "నాక్కావాల్సినవి రెండే. ఈ నెగటివు కూడా ఇచ్చే." అని తీసేసుకుంది. ప్రసన్న.

"ఎందుకో, ఇవి - నీకు?"

ప్రసన్న నవ్వినందుకు సరదా పడ్డాడు శివరావు. 'నీ ఫొటో నా దగ్గిరుండ కూడదా?' అంటే ఇంకా ఆనందించేడు.

"నీ ఫ్రెండు ఈ రాత్రి వరకూ రాడు; ఏం?

"ఔను".

"అంతవరకూ నువ్వు ఖాళీ-"

"ఔను! ఏం?"

"మన ప్రోగ్రాం చెప్తాను విను; ఇప్పుడు టైం ఎనిమిదీ ఇరవై. మనం టిఫిన్ తిని కాఫీ తాగేసరికి మరో ఇరవై నిమిషాలనుకో. ఓ అరగంటపాటు నాక్కొంచెం ఆఫీస్ వర్కుంది. అంటే మరేం లేదు; ఇవాళ సెలవు పెడుతున్నాను కదా అని నిన్న సాయంకాలం ఇంటి కొచ్చేటప్పుడు నాలుగు అర్జంటు ఫైల్సుంటే తెచ్చేసేను. రాత్రి రెండు ఫైల్స్‌లో నేను రాయవలసిందంతా రాసేను. ఇంకో రెండున్నాయి. అవి ఇప్పుడు కొట్టేస్తాను. తొమ్మిదిన్నరకి కొంచెం అటూ ఇటూగా నాకొక ఫోన్‌కాల్ ఒస్తుంది. ఆ తరవాత మనం బైటికి వెళ్తాం. నా ఫ్రెండ్సు, శ్రేయోభిలాషులు - కొందరికి నిన్ను పరిచయం చేస్తాను. నందనం ఏరియాలో మా ఆఫీసుంది. ఇక్కడికి పెద్ద దూరం కాదు. అక్కడి కెళ్లి ఈ ఫైల్సు మా ఆఫీసర్ గారికిచ్చేస్తాం. సి.ఐ.టి.నగర్‌లో నాకు తల్లి తరవాత తల్లిలా అనిపించిన మీనాక్షమ్మగారున్నారు. ఆవిడ మొన్నమొన్నటి దాకా మా ఆఫీసులో పనిచేసి సీనియర్ సూపరింట్‌గా రిటైరైంది. టి.నగర్‌లో పరాంకుశం గారని, మనవేపు వాళ్లే ; ఇక్కడ కాంట్రాక్టులు చేస్తున్నారు; ఆయన్నోసారి పలకరిద్దాం. అన్నట్టు, నీ ఫ్రెండింట్లో ఫోనుంది కాబోలు; ఆ బోయ్ ఉంటాడేమో; నువ్వు మధ్యాన్నం భోజనానికి రానని చెప్పి-"

ప్రసన్న మాట్లాడుతూనే; సెల్వి తెచ్చిన టిఫిన్ సరంజామాని తనకీ శివరావుకీ అందుబాటుగా, అనువుగా సర్దింది.

"నీ ఇల్లు చాలా పెద్దదిలాగే వుందే?"

"పెద్దదే. అయితే ?"

"అదికాదు; మనం ఈ టిఫిన్ కార్యక్రమం ఇక్కడ కాకుండా డైనింగ్ టేబిల్ మీదనే చేసుండొచ్చు కదా?"

"ఇవాల్టికి ఇలా కానిద్దాం. నువ్వీసారి వొచ్చినప్పుడు నీ కోరిక ప్రకారం డైనింగు టేబిలూ బెడ్రూమూ అన్నీ చూద్దుగాని!"

"థేంక్యూ."

"ఎందుకు?"

"నీ మాటల్లో; నన్ను మళ్లీ ఓసారి రమ్మన్న ఆహ్వానం వుందిగా; అందుకు!"

"ఓ, అదా? కానీ, నేను రమ్మనకపోయినా నువ్వు మళ్లా ఒస్తావు!"

"ఏమిటో, ఆ గ్యేరంటి?"

"నీ ఫ్రెండెవరో, ఆ రమణయ్య; నువ్వడిగిన డబ్బు - అదే - ఇరవై వేలు... ఇస్తాడా?"

"ఇస్తాడనుకుంటాను!"

"ఇవ్వడని నేననుకుంటున్నాను. ఓవేళ యిచ్చినా; అంతా ఒకసారిగా ఇవ్వడు. ఇప్పుడో పదివేలు నీ చేతిలోపెట్టి కాయితం రాయించుకుని మిగతా డబ్బుకోసం ఓ ఇరవైరోజులో నెలో పోయాక రమ్మంటాడనుకో-"

"అలాంటి వాడు కాదు ప్రసన్నా... అతనీ సాయంకాలం వస్తాడు. రేపు సాయంకాలంలోగా యివ్వగలిగేడా, సరి. లేకపోతే అంతే సంగతులు."

"అదే, నేనంటున్నదీనీ, " మరికొంచెం ధారాళంగా నవ్వింది ప్రసన్న. "అతను ఇవ్వలేదు కదా అని నీ అవసరం తప్పిపోతుందా? మళ్లీ ఇరవై రోజుల్లో నువ్విక్కడికి వస్తావు!"

"ఇప్పుడివ్వకపోతే యిరవై రోజుల తరవాతయినా యివ్వడు!"

"అతనివ్వకపోతే ఇంకెవరూ యివ్వకూడదా?" కళ్లుకొంటెగా మార్చి నవ్వింది ప్రసన్న. అటుచూసిన శివరావుకి చేతిలో ఉన్న ఇడ్లీముక్క నోట్లోకి వెళ్లకుండా చేత్తో బాటే కిందికి దిగిపోయింది.

"థేంక్యు, ప్రసన్నా; థ్యాంక్యు వెరిమచ్!"

"వెల్కమ్... నీ పట్టుదల నాకు తెలుసు... ... నే నైనా , వెంటనే ఇచ్చేద్దును గానీ, అంతడబ్బు ఎప్పుడంటే అప్పుడు తియ్యగలిగే రకంగా ఉంచుకోడం లేదు. ఏదైనా బేంక్ డిపాజిట్లోంచిగాని ప్రావిడెంట్ ఫండ్లోంచి గాని తీసే ఏర్పాటుకి కొంత వ్యవధి కావాలి కదా!"

✤ ✤ ✤

పదింపావు.

"ఆఫీస్ ఆఫ్‌ది అసిస్టెంట్ కలెక్టర్. కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సయిజ్-" అనేబోర్డు ఉన్న ఓ భవనం దగ్గిర ఆటో ఆపించింది ప్రసన్న.

"దిగు. ఇదే మా ఆఫీసు!"

శివరావు దిగాడు.

ప్రసన్న ఆటోఛార్జి చెల్లించి "పద!" అని తనే ముందు నడుస్తూ, సరాసరి అసిస్టెంట్ కలెక్టర్ గారి రూమ్‌లోకి వెళ్లింది. సందేహిస్తూ నుంచున్న శివరావుకి "రా!" అని సంజ్ఞ చేసింది.

"నమస్కారం సార్." అని తను కూర్చుంటూ శివరావుని కూర్చోబెట్టింది ప్రసన్న. "ఇవి - నాలుగు అర్జంటుఫైల్సు; నిన్న మీరు చెప్పినవి. ఇతను - వెంక్రటామయ్య- యూనివర్సిటీలో నేను ఎమ్మెస్సీలో ఉన్నప్పుడు ఎం.కామ్.చదివేరు. విజయవాడలో స్టెయిన్‌లెస్ స్టీల్ షాపుంది. ఈయన్ని గురించే, నేనిందాక మీతో ఫోన్‌లో మాట్లాడేను. మీ ఆశీస్సులకోసం వచ్చాం."

"అయామ్ శ్రీధరన్. గ్లాట్టుమీట్‌యు." అని కుర్చీలోంచి సగం లేచి, కుడిచెయ్యి సగం జాపి, శివరావు చెయ్యి అందుకుని నొక్కాడు ఆయన.

శివరావుకి ఒళ్లు వణికింది. నోట మాట రాలేదు. "కాదు! అన్నీ అబద్ధాలు!" అని అరవాలనిపించింది. కాని, ఈయన ప్రసన్నకి బాస్. ప్రసన్నని బైటపెట్టేస్తే ఆమెకి ఏదైనా ప్రమాదమో అవమానమో కలగొచ్చు - అనుకుని మాటయినా లేకండా కుర్చీలో సర్దుకున్నాడు.

ప్రసన్న చకచకా వాలెట్ తెరిచి, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలు లాగి శ్రీధరన్ కిచ్చింది. "ఓకే, నేను సర్టిఫై చేస్తాను!" అన్నాడాయన, టేబిల్ సొరుగులోంచి ఒక అచ్చుఫారం తీసి. "సంతకాలు పెట్టండి;" అని ఆ కాగితాన్ని ప్రసన్నకిచ్చేడు. ప్రసన్న మెరుపువేగంతో సంతకం పెట్టేసి; "ఇదుగో, యిక్కడ!" అని ఆ కాగితంమీద ఒకచోట వేలు పెట్టి దాన్ని శివరావు వేపు జరిపింది. " కె. వెంకటరామయ్య- అంటూ పూర్తిగా చెయ్యక్కర్లేదు; కె.వి. రామయ్య అన్నా సరిపోతుంది." అంది. శివరావు "కె.వి. రామయ్య " అని సంతకం చేస్తూనే పైన అచ్చువేసి ఉన్న వాక్యాలని ఆ నాలుగు క్షణాల్లోనే అసందిగ్ధంగా చదివేశాడు:

సైదాపేట జాయింట్ రిజిస్ట్రార్ ఆఫ్ ఎస్యురెన్సెస్ పేరిట ఉన్న ఆ దరఖాస్తులో 'వి. ప్రసన్నలక్ష్మి(34) కె.వెంకటరామయ్య(37) అనే ఈ దిగువ సంతకాలు చేసిన ఇద్దరము చట్టబద్ధమైన వివాహం చేసుకోవాలని సంకల్పించుకున్నాము. కేంద్రప్రభుత్వానికి చెందిన ఒక ఉన్నతాధికారి సమక్షంలో ఈ దరఖాస్తు ఫారంమీద సంతకాలు చేయడమైనది. ఈ దరఖాస్తును తమరు పరిశీలించి, చట్టం ప్రకారం అవసరమయ్యే గడువు అనంతరం సంబంధిత రికార్డులలో నమోదుచేసి మాకు వివాహ ధృవపత్రం దయచేయించ ప్రార్థన.' అనేది సారాంశం. చట్టంపేరు, సంవత్సరం,సెక్షను, సబ్‌సెక్షనుల నెంబర్లు; అన్నీ అచ్చులో వున్నాయి.

శ్రీధరన్‌గారు వీళ్లిద్దరి సంతకాలకిందా ఆకుపచ్చ సిరాతో ఏదోరాసి సంతకంచేసి, తన ఉద్యోగ హోదా ఇతర వివరాలు తెలిపే రబ్బరుస్టాంపు వేసి, ఫారం, ఫొటోలు తన టేబిల్ సొరుగులో పెట్టి లేచి నుంచున్నాడు.

ప్రసన్న, శివరావు నడుంమీద గోటితో పొడిచింది. "పద" అంది. శివరావు యాంత్రికంగా లేచి నిలబడ్డాడు. "మళ్లీ కలుద్దాం" అన్నాడు శ్రీధరన్ గారు.

✣ ✣ ✣

"నువ్వన్నదే రైటవాలని నేనూ అనుకుంటున్నాను! రమణయ్యనా కిస్తానన్న ఇరవై వేల్లో కొంత ఇప్పుడిచ్చినా మళ్లీ ఇరవై రోజుల తరవాత రమ్మంటాడు. అప్పుడు ఈ పాత అనుబంధపు కొత్త స్వరూపం రుచీ ఎలా వుంటాయో తేల్చుకోవచ్చు!" అనుకుంటూ ఆ త్రీ-స్టార్ హోటల్ భోజనాల హాల్లోంచి యివతల పడ్డాడు శివరావు. "దీని తెలివి రోజురోజుకీ పదునెక్కుతోంది! వేరే పేరుతో వేరే వూళ్లో జరిపితేనే, హాయి; ఇలాంటి వ్యవహారం!"

"ఏమిటి; దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?"

"ఇరవై రోజుల తరవాత మళ్లీ రావాలి కదా. అప్పటి తిరుగు ప్రయాణానికి రిజర్వేషన్ యిప్పుడే చేయించేసుకుంటే మంచిదేమో అని- "

"అంటే - ?" నవ్వింది ప్రసన్న. "అప్పుడు కూడా ఓ పదిరోజులు ఉండే విధంగా రావా? రిసెప్షనూ అదీ పెడతానంటున్నారు మీనాక్షమ్మ గారు... ...?"

"ఔనౌను కదూ; మర్చేపోయేను!"

ప్రసన్న మళ్లీ నవ్వింది; ఆటో ఎక్కమని సంజ్ఞచేస్తూ "గుట్టుగా ఉండగలవు కదా?... నేను ఉత్తరం రాయక్కర్లేదు కదా. రమ్మని ?"

✣ ✣ ✣

"ఎవడే, వాడు? పొద్దుటే లేచి ఏమిటి వాడితో తగువు?" అంది అమ్మ; శివరావు అటు గుమ్మం దాటగానే నే నిటువేపు తలుపు తీస్తేను.

సూట్‌కేసు పుచ్చుకుని మెట్లు దిగిన శివరావు అప్పటికి గేటుమీద సర్దవలసిన యినపరింగు పట్టుకొని యిటు వేపు తిరిగేడు. ఆఖరి చూపు నిలబెట్టిన రెండు క్షణాల్లో అమ్మ ముందుగదిలో కొచ్చింది. శివరావు ఒక్కసారిగా నడకలోకి వేగం తెచ్చుకుని వెళిపోయాడు.

"ఎవరే, అతనూ?"... అని అమ్మ ఈసారి మాట మార్చి అడిగింది. "ఆ మొహం యెక్కడో చూసినట్టున్నానే!... ..." నాకు దగ్గిరగా వచ్చిన మనిషి మళ్లా ఒక్క అడుగు వెనక్కివేసి, నోటిమీద

అరిచేత్తో కొట్టుకుని" వ్వ-వ్వ-వ్వ- అని చప్పుడు చేసింది. "ఎంత గుండెల్తీసిన బంటువే!?" అంది, నిర్ఘాంతంగా.

నేను అమ్మకి దగ్గిరగా వెళ్లాను. అమ్మ రెండు జెబ్బలూ నాచేతుల్తో పట్టుకుని అలా వెనక్కి నడిపించి, అమ్మని సోఫామీద కూల బెట్టేను.

"అమ్మా, నువ్వేం గాభరాపడిపోకు. అలా కూచో, చెప్తాను." అని నేను అమ్మకి ఎదురుగుండా ఆ ఇనప మడతకుర్చీ జరుపుకుని కూచున్నాను.

"అసలీ గొడవలో బాధపడవలిసింది నేను! కాని; నే నా మొట్టమొదటి రోజునే గుండె రాయి చేసుకుని- నువ్విందాక న్నావే - గుండెలు తీసిన బంటునయ్యేను. .. ఇతనూ నేనూ మొదట్లో ఎలావున్నా మళ్లా కలుసుకునే సరికి నాకు ముప్ఫయి నాలుగేళ్లు. అంటే; ఈడొచ్చిన నాటినుంచీ కనీసం యిరవయ్యేళ్ళు నావొంటిమీద మొగాడి చెయ్యిపడకుండా గడిపేను. మనింట్లో అయితే నాన్న, అన్నయ్య; మన ఇరుగు పొరుగుల్లో ఐతే సీతారామయ్యా రమణయ్య; మన వీథిలో అయితే మరో వెంకయ్యా పుల్లయ్యా; మా ఆఫీసులో అయితే కార్తికేయన్, కమలనాభన్ - ఇలా - ఎందరెందరో మొగాళ్లు; కాదు- మొగ వెధవలు! - తల్లనీ, పెళ్లామనీ, చెల్లనీ, పిల్లనీ చూడకుండా ఆడదంటూ ఎవత్తి దొరికితే దాన్ని ఎలా వీలైతే అలాగ ఏడిపించడం కాల్చుకు తినడం - చూసీ చూసీ నే నిలా బండ బారిపోయేను.

"నాన్నుండేవాడు. తనకి నేను చదువుకోడమే యిష్టం వుండేదికాదు. నీ సాయంతో నేను నాలుగక్షర మ్ముక్కలు నేర్చుకున్నాను. చేతనయిన పరీక్షలు కొన్ని; ఇంట్లో కూర్చుని చదివే పాసయ్యేను. భూములు పోయి మనం పట్నం చేరడం వల్ల నాకు మేలే జరిగింది. పట్టుదలగా స్కాలర్‌షిప్పులు సంపాదించుకుని ఎమ్మెస్సీ దాకా చదివేను. యూపీ ఎస్సీ వాళ్లిచ్చింది చిన్న వుద్యోగమే అయినా మీరందరూ తిండిలేక అల్లాడుతున్నప్పుడు నా కడుపుమాడ్చుకుని మీకు డబ్బులు పంపేను. నాకు గానీ పెళ్లి చేసేస్తే నన్నూ నా సంపాదన్నీ ఎవడో యెగరేసుకు పోతాడని నా కొచ్చిన సంబంధాలన్నీ తిరగ్గొట్టేసేరు. అదంతా మీకే కాదు; నాకూ తెలుసు!

"సంసారం, కుటుంబ పద్ధతీ మంచివి కావని నేనూ అనను. కానీ, ఒంటరిగా బతకడం ఆడదానిక్కూడా చేతనవుతుందని ఇరవై ఏళ్ల వయస్సొచ్చేసరికే నాకు తెలిసింది ఎక్కడో ఉత్తరాంధ్రలో అగ్రహారంలో పుట్టి, చాలా భాగం చదువు ఇంట్లో కూర్చునే సాగించి, మొదటి వుద్యోగమే భాషతెలీనిచోట వొస్తే నేను నెగ్గు కొచ్చేనా, లేదా?

"కానీ, నా డబ్బు సాయంతో మీ అందరి బతుకులూ వో కొలిక్కి వచ్చేక నా ఆస్తి పెరిగి దానికోసం నాకో వారసుడు అవసరం అనిపించింది. నా ముసలితనంలో నన్ను కనిపెట్టుకుని వుండే ఒక పేగు కావాలనిపించింది. చెప్పేనుగా; అప్పటికి నాకు ముప్ఫయి నాలుగేళ్లు. అయినా నేను పెళ్లిచేసుకుపోతే మీరంతా నడివీథిని పడతారు. అదలా వుంచగా నేను పెళ్లి చేసుకోవాలనుకున్నా బాగా అరిగిపోయిన వాడే దొరుకుతాడు. వాడైనా నాడబ్బుకోసం వస్తాడు గాని నేనేదో వాణ్ణి సుఖపెడతానని రాడు. ఆమాత్రం దానికి పెళ్లి పేరు చెప్పి వాడికెవడికో చాకిరీ చెయ్యడం, అణిగి మణిగి వుండడం,నా సంపాదనంతా వొప్పగించడం - ఈ పెంటంతా పడ్డానికి నా కిష్ట మవలేదు.

'ఈ వెధవ - ఈ శివరావుగాడు -చదువుకుంటున్న రోజుల్నించీ నా వెంట పడ్డవాడే. నేనెవరో తెలుసుకున్నాడు. నన్ను పెళ్లిచేసుకుంటే లాభమా నష్టమా అని ఎప్పటికప్పుడు లెఖ్ఖలు వేసుకున్నాడు. నా వెంటపడీ పడీ ఇందులో లాభం అట్టే కలగదని తేల్చుకున్నాడు. వేరే పెళ్లి చేసుకున్నాడు. సంసారం

చేసి పిల్లల్ని కన్నాడు. ఆస్తి పెంచుకున్నాడు. ఐనాసరే, నా వొళ్ళు దొరికితే ఓ ఆటాడుదామని మళ్లీ తగలడ్డాడు... నేనేనా, అంత తెలివి తక్కువ దాన్ని? వాడి మొహాన పదివేల రూపాయలు కొట్టి; ఏదైనా దుకాణంలో వస్తువుతో బాటు బిల్లు తెచ్చుకున్నట్టు రసీదు తీసుకుని జాగర్త పెట్టుకున్నాను!'

"రసీదా?" అంది అమ్మ.

"రసీదే... ... నిన్నటి రోజున సైదాపేట రిజిస్ట్రాఫీసులో చట్ట బద్ధంగా నాకు భర్త అయిన కె. సుబ్బారావు గారి కుమారుడు కె. వెంకటరామయ్య గారి యొక్క సుఖజీవన స్థాయి పెరుగుదల నిమిత్తం వి. సుబ్రహ్మణ్యం కుమార్తె వి. ప్రసన్న లక్ష్మి అనే నేను ఇష్టపూర్వకంగా అతనికి పదివేల రూపాయలు ఇచ్చినందున ఈ రసీదు తీసుకోవడ మయినది. అని దస్తావేజు కాగితం మీద రాసి; దానిమీద అతని దొంగసంతకం, నా అసలు సంతకం తో సహా నా బేంక్‌లాకర్‌లో జాగర్త పెట్టేను. అతగాడు తన పేరు పట్టిసం సుందర శివరావు అయినప్పటికీ కె. వెంకటరామయ్య అని వేరే పేరు పెట్టుకుని రిజిస్ట్రార్ ఆఫీసులో తన ఫోటోతో సహా నిర్ధారణ పత్రం ఇచ్చేడు. నాక్కావల్సిన విధంగా నాకో వారసుణ్ణి ఇచ్చేడు.

"అతను నామీద ఏమాత్రం పెత్తనం చెలాయించినా, నాకిష్టంలేని రకం ఆశ ఏదైనా చూపించినా; నేను తల్చుకుంటే అతన్ని ఏక్షణమందైనా ఇండియన్ పీనల్‌కోడ్ 494, 420 సెక్షన్ల కింద జైలుకి పంపించగలను! ఆమాటే చెప్పి పంపేను. వాడు నాకు వల వేసేననుకుంటూనే నేను పన్నిన వల్లో ఇరుక్కుపోయేడు. ఆమాటే వాడికి అరిటిపండు వొలిచి చేతికిచ్చినట్టు బోధపరిచి పంపించేను."

✣ ✣ ✣

నేను లోపలిగదిలోకి వెళ్తున్నప్పుడు; అప్పుడెప్పుడో నాలో పుట్టిన సున్నితమైన భావాలు కొన్ని, ఇప్పుడు నా తలలో వాటి తలలెత్తి నన్ను కలల్లో కలవరంలో పడెయ్యాలని చూసేయి. యిలా కొంతకాలం పాటు అప్పుడప్పుడైనా అవి నన్ను పలకరిస్తాయని నాకు తెలుసు.

వాటిని అలక్ష్యం చెయ్యడానికి నాకు కొంచెం సమయం పడుతుంది.

✣ ✣ ✣

"అది కాదు చిన్నీ!"

అమ్మ... ... చేతిలో కాఫీ గ్లాసు; నా వేపు జాపి,

"పాపం; ఇప్పుడతని పెళ్లాం పోయిందిట కదా! ఆ పిల్లలు పెద్ద వాళ్లయిపోయి ఎవరి దార్ని వారు పడుతున్నార్ట కూడా కదూ! అతన్తోవుంటే నీకొడుకుని నీకంటే బాగా దిద్ది పెద్దవాణ్ణి చేస్తాడేమోనే.. ఆలోచించు తల్లీ...

రెండుగుక్కల మధ్య చిన్న విరామం తీసుకున్నాను.

"నన్నూ నా కొడుకునీ ఎవ్వరూ దిద్దక్కర్లేదు; పెద్దచెయ్యనూ అక్కర్లేదు. ఆ విద్యలు ఇవాళ మొగ జాతికెంత తెలుసో ఆడజాతికీ అంతా తెలుసుననే నా నమ్మకం, సిద్ధాంతం.

☼

***(" ఇండియా టుడే "; వార్షికసాహిత్య సంచిక 1996)***